అర్ధంతరంగా నిలిచిన రోడ్డు విస్తరణ పనులు



మల్లంపేట హనుమాన్ గుడి నుంచి ఓఆర్ఆర్ వరకు ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ప్రజలు

దుండిగల్: రోడ్డు విస్తరణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని.. నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో నరకయాతన అనుభవిస్తున్నామని పలు కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో బాచుపల్లి క్రాంతినగర్ నుంచి మల్లంపేట ఔటర్ రింగ్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు. ప్రస్తుతం సదరు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో మల్లంపేట పరిసర ప్రాంతాల కాలనీల ప్రజలు బుధవారం నిరసన తెలిపారు. మల్లంపేట హనుమాన్ గుడి నుంచి ఓఆర్ఆర్ వరకు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ప్రతి రోజు తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని... రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ప్రమాదాల బారిన పడుతున్నామన్నారు. ఇదే విషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయాలన్నారు.

ఆకలి నిర్మూలన మనందరి బాధ్యత



గాంధీ ఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సుభాష్‌నగర్: హంగర్స్ డేను పురస్కరించుకుని బుధవారం 'మేము సైతం మీ కోసం ఫౌండేషన్' సభ్యులు గాంధీ ఆస్పత్రి సమీపంలో 225 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ శివకుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నల్లమల కోటేశ్వరరావు మాట్లాడుతూ... ప్రపంచ ఆకలి సూచి 2023 ప్రకారం ఆకలి నిర్మూలనలో భారతదేశం 111వ స్థానంలో ఉందన్నారు. ఇది ఆందోళన కలిగించే విషయమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి తొమ్మిది మందిలో ఒకరు ఆకలితో అలమటిస్తున్నారని తెలిపారు. ఆకలి నిర్మూలన బాధ్యత ప్రభుత్వాలదే కాదు మనందరి బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు భాగ్యశ్రీయాదవ్, హాలిగే నర్సింగ్, ఓంకార్ తదితరులు ఉన్నారు.

మాసూం పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి



సంతాప సభలో మాట్లాడుతున్న ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్ ఓంకార్

రంగారెడ్డినగర్: పాలకవర్గాలపై మాసూం పోరాట స్ఫూర్తితో నేటి యువతరం ముందుకు సాగాలని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్ ఓంకార్ అన్నారు. ఎంసీపీఐ(యూ) కమిటీ సభ్యుడు మాసూం సంతాప సభను బుధవారం రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లోని ఠాగూర్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి రవి మాట్లాడుతూ... ఓంకార్ పోరాట స్ఫూర్తితో గాంధీనగర్ ప్రాంతంలో అనేక పరిశ్రమలలో యూనియన్లు స్థాపించారన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు వారధిగా ఉండి ఎంసీపీఐ(యూ) పోరాటాలను మాసూం బలోపేతం చేశారన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వనం సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కౌన్సిల్ మెంబర్ యూసుఫ్, ఏఐఏడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వరికుప్పల వెంకన్న, ఏఐసీటీయు జాతీయ వర్కింగ్ మెంబర్ గోనె కుమారస్వామి, రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

సుభాష్‌నగర్: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు, వ్యక్తుల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయని కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ సేవాదళ్ ప్రెసిడెంట్ చింతల సాయియాదవ్ అన్నారు. మంగళవారం రాత్రి దూలపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో సాయి యాదవ్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. రాత్రి 10గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు జరిగిన ఈ కబడ్డీ పోటీల్లో 12 జట్లు పాల్గొన్నాయి. కాసాని టీమ్ మొదటి స్థానం, భరత్‌నగర్ జట్టు రెండో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన జట్లకు మేడ్చల్ జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు చింతల నాగరాజు యాదవ్‌తో కలిసి సాయి యాదవ్ బహుమతులు అందజేశారు.



గెలుపొందిన జట్టు సభ్యులతో సాయి యాదవ్

విష వాయువులు వదులుతూ..
ఆరోగ్యాలు పాడు చేస్తూ!

పట్టించుకోని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు

జీడిమెట్ల: రాత్రిపూట విష వాయువులను బయటకు వదులుతున్న పరిశ్రమలపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జీడిమెట్ల ఎస్వీ కో–ఆపరేటీవ్ సొసైటీలోని పలు రసాయన పరిశ్రమల నుంచి రాత్రిపూట విపరీతంగా పొగలు వెలువడుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. పరిశ్రమల నుంచి ఘాటైన రసాయనాల పొగలు సమీప కాలనీలైన సుభాష్‌నగర్ వరకు ప్రభావం చూపుతున్నాయని సుభాష్‌నగర్ ప్రజలు అంటున్నారు.

సతమతం అవుతున్న ప్రజలు..

రాత్రిపూట ఘాటైన వాసనలు ఇళ్లల్లోకి వస్తుండటంతో సుభాష్‌నగర్, గంపలబస్తీ, వెంకటాద్రినగర్ ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురి అవుతున్నామని అంటున్నారు. ఒక్కోసారి రాత్రివేళల్లో విపరీతమైన పొగలు వెలువడి కళ్లల్లో మంటలు వస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎస్వీకో ఆపరేటీవ్ సొసైటీలో ఉన్న కొన్ని రసాయనాల పరిశ్రమలు రాత్రిపూట ఓపెన్ జాగాలో డిస్టలేషన్ చేయడం వలన ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ప్రజలు పట్టించుకుని సదరు పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బయటకు వెలువడుతున్న రసాయన పొగలు

గుడిసెవాసులను బెదిరిస్తూ..
మురుగు వదులుతూ..!

దిక్కున్న చోట చెప్పుకోండంటూ దురుసు ప్రవర్తన

కుత్బుల్లాపూర్: ఇప్పటికే అధికారులు హెచ్చరించారు.. అయినా వారిలో మార్పు రాలేదు... పైగా మురుగు వదలొద్దు అన్నందుకు... బెదిరింపులకు దిగుతూ.. మీ దిక్కున్న చోట చెప్పుకో అంటూ... ఆదేశాలు జారీ చేయడంతో ఆ గుడిసెవాసులు బెదిరిపోయారు... జీడిమెట్ల డివిజన్ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న రిలయన్స్ పెట్రోల్ బంక్ పక్కనే ఓ బహుళ అంతస్తులు నిర్మాణంలో ఉండగా అందులో ఉన్న డ్రైనేజీ ఓపెన్‌గా వదలవడం మూలంగా సమీపంలో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న 40 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయంపై గతంలో కుత్బుల్లాపూర్ సర్కిల్, వాటర్ వర్క్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. డ్రైనేజీ బయట వదలం అని చెప్పిన సదరు బిల్డింగ్ యజమాని.. రెండు రోజులు ఆగి తిరిగి డ్రైనేజీ వదలడం మొదలుపెట్టాడు.. ఇదేమని గుడిసె వాసులు ప్రశ్నిస్తే.. నీ దిక్కున చోట చెప్పుకో.. మమ్మల్ని ఎవరూ ఏమి చేయరు అంటూ బెదిరింపులకు దిగారు. ఇప్పటికే అనేక వ్యాధులతో బాధపడుతున్న తాము.. డ్రైనేజీ ఇలా వదలొద్దు అని చెప్పినందుకు బెదిరిస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి సదరు భవన యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఇలా గుడిసెల మధ్య నుంచి మురుగు వదులుతూ..



మర్యాదపూర్వక కలయిక



శేఖర్‌యాదవ్‌ను శాలువాతో సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

జగద్గిరిగుట్ట: బీజేపీ బలోపేతానికి తమ వంతు కృషి ఎప్పటికీ ఉంటుందని గిరిజన మోర్చా కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ అంగడి మల్లేష్ అన్నారు. జగద్గిరిగుట్టకు చెందిన శేఖర్‌యాదవ్ ఇటీవలే కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రిమినల్ చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: క్రిమినల్ చట్టాలపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి అన్నారు. బుధవారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ విజయవర్ధన్ అధ్యక్షతన సిబ్బందికి కొత్త క్రిమినల్ చట్టాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఏదైనా కేసు నమోదు చేసే ముందు ఏయే సెక్షన్లు పెట్టాలనే దానిపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు కొని నష్టపోవద్దు



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి మాధవరెడ్డి

దుండిగల్: నకిలీ విత్తనాలు కొని రైతులు నష్టపోవద్దని, అధీకృత లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లాపూర్, నాగులూరు ప్రాంతాల్లో బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ... రానున్న వర్షాకాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులకు సబ్సిడీపై జనుము, జీలుగాను అందజేస్తున్నామని తెలిపారు. బౌరంపేటలోని సహకార కేంద్రంలో వాటిని తీసుకోవాలని సూచించారు.

1న నృత్య సంగీతంపై ప్రసంగం

చిక్కడపల్లి: ప్రముఖ సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి 65వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న భారతీయ శాస్త్రీయ నృత్య సంగీత రీతుల ప్రసంగ పరంపరలో భాగంగా నృత్య సంగీతంపై జూన్ 1న శ్రీ త్యాగరాయ గానసభలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయ్‌కుమార్ , సమన్వయ కర్త నిష్టల సుధామాల తెలిపారు. బుధవారం చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో కార్యక్రమ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

చిరుత పులి కాదది అడవి పిల్లి

పిల్లిని పెంచుకుంటున్న వ్యక్తికి అప్పగించిన ఫారెస్ట్ అధికారి



సెల్లార్‌లో దాక్కున్న అడవి పిల్లి

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లో అడవి పిల్లిని (జంగల్ క్యాట్) చూసి, చిరుత పులి సంచరిస్తుందని స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కైసర్‌నగర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో బుధవారం ఉదయం 6గంటల సమయంలో అడవి పిల్లి సంచరించింది. అచ్చం చిరుతపులిని పోలి ఉండటంతో స్థానికంగా ఉన్న సెక్యూరిటీ గార్డులు వారి ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు.

◆ అతడు స్థానికుల సాయంతో అక్కడికి చేరుకొని పరిశీలిస్తుండగా డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలోని బ్లాక్ నంబర్.1లోని సెల్లార్‌లోకి దూరింది. పిల్లిని స్థానికంగా ఉండే కిరణ్, కిషోర్‌లు బంధించారు. అనంతరం ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని చిరుత కాదు.. అడవి పిల్లిని అని తేల్చేశారు. బౌరంపేటలో రాకేష్ అనే వ్యక్తి నడుపుతున్న ఫామ్ నుంచి ఫీడ్ పెడుతున్న సమయంలో తప్పిపోవడంతో 15 రోజుల క్రితమే తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. సదరు అడవి పిల్లిని రాకేష్‌కు అప్పగించినట్లు అధికారి లక్ష్మణ్ పేర్కొన్నారు.



అడవి పిల్లిని పట్టుకున్న స్థానికులు

డ్రైనేజీ పనులు చేస్తుండగా దెబ్బతిన్న గ్యాస్ పైపులైన్

మరమ్మతులు చేయడంతో ఊపిరి పీల్చుకున్న స్థానికులు

నిజాంపేట్: పోలీసుల అప్రమత్తతతో గ్యాస్ పైపులైన్‌కు తలెత్తిన లీకేజీకి మరమ్మతులు నిర్వహించడంతో పెనుప్రమాదం తప్పింది. మంగళవారం రాత్రి రాజీవ్‌గాంధీనగర్‌లోని బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో డ్రైనేజీ పనులు చేస్తుండగా గ్యాస్‌పైపులైన్ దెబ్బతింది. దీంతో పెద్ద మొత్తంలో గ్యాస్ లీక్ అయ్యింది. సమాచారం అందుకున్న బాచుపల్లి ఎస్సై సంధ్య పెట్రోల్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు దారి మళ్లించారు. సదరు గ్యాస్ ఏజెన్సీ, ఫైర్ స్టేషన్ సిబ్బంది చేరుకుని ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. పైపులైన్‌కు మరమ్మతులు నిర్వహించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైనేజీ పైపులైన్ పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణితో పైపులైన్ దెబ్బతిందని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



గ్యాస్ పైపులైన్ వద్ద మరమ్మతులు నిర్వహిస్తున్న దృశ్యం

వైన్స్ ముందు పార్క్ చేసిన వాహనాలే టార్గెట్

● బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్టు ● 22 బైకులు, ఒక ఆటో స్వాధీనం



వివరాలు తెలియజేస్తున్న బాలానగర్ ఏసీపీ హన్మంత్‌రావు, సీఐ క్రాంతికుమార్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

జగద్గిరిగుట్ట: వైన్స్ షాపుల దగ్గర బైక్‌లను మాయం చేసే దొంగను అదుపులోకి తీసుకున్న ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బాలానగర్ ఏసీపీ హన్మంత్ రావు, సీఐ క్రాంతి కుమార్ వివరాల ప్రకారం శివంపేట్, లచ్చి రెడ్డి గూడెంకు చెందిన వారెం ఆనంద్ రెడ్డి (28) సూరారం కృష్ణానగర్‌లో ఉంటున్నాడు. కాగా ఇతను వైన్స్ ముందు పార్క్ చేసిన వాహనాలే టార్గెట్ చేస్తూ దొంగిలించడం మొదలు పెట్టాడు. పక్కా సమాచారంతో ఆనంద్‌రెడ్డిని అరెస్టు చేసారు. వివిధ వైన్స్ షాపుల ముందు దొంగిలించిన 22 బైకులను, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్, చౌటుప్పల్, మెదక్, సంగారెడ్డి తదితర పోలీస్ స్టేషన్‌లలో ఈ వాహనాలు దొంగిలించినట్లు విచారణలో ఆనంద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మళ్లీ అదే వరుస..



సుచిత్ర మీసేవ కార్యాలయం వద్ద ఉదయం 9.15 గంటలకు క్యూలో జనం

సుభాష్‌నగర్: కొత్త ఆధార్ కార్డు, తప్పుల సవరణ నిమిత్తం కొన్ని నెలలుగా సుచిత్రలోని మీసేవా వద్ద కార్యాలయం వద్ద బారులు తీరుతున్నారు. కొన్ని రోజులుగా రద్దీ తక్కువగా ఉండేది. 3 రోజుల నుంచి పాత సీన్ మళ్లీ రిపీట్ అయ్యింది. రోజుకు 100 మందికి టోకెన్ సిస్టం ఉండటంతో ఉదయం 6గంటలకే వచ్చి క్యూలో నిల్చుంటుననారు. బుధవారం 40 నిమిషాల పాటు మీసేవ కార్యాలయం లేటుగా తీయడంతో క్యూ మరింత పెరిగింది.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. జీబీఆర్ ఫీడర్ పరిధిలోని పీఎస్ఆర్ కన్వెన్షన్ రోడ్డు, రిలయన్స్ పెట్రోల్ బంక్ రోడ్డు, సయ్యద్‌నగర్, ప్యారడైజ్ రోడ్డు, టొబాకో కంపెనీ, జీబీఆర్ కల్చరల్ క్లబ్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్లాంట్ జెనెటిక్, ఏజీ వర్సిటీ ఎంఓయూ

ఏజీవర్సిటీ: భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి పరిధిలోని నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మధ్య బుధవారం అవగాహన ఒప్పందం చేసుకున్నారు. క్రాప్ ఇంప్రూవ్‌మెంట్ కార్యక్రమాలలో ప్లాంట్ జెనెటిక్ వనరుల వినియెగం ప్రధాన లక్ష్యంగా ఈ ఒప్పందం కుదిరింది.అలాగే పరిశోధన, విద్యా కార్యక్రమాలలోను ఇరు సంస్థలు కలిసి పని చేయాలని నిర్ణయించాయి.దీనివల్ల పీజీ ,పీజెడ్ విద్యార్థులకు పరిశోధనలో ఎంతో ఉపయోగం ఉంటుంది. దీంతో పాటు ఇరు సంస్థల శాస్త్రవేత్తలు కలిసి పరిశోధనలు చేయడానికి ఇది చాల దోహదం చేయనుంది.రాజేంద్రనగర్‌లోని ఎన్‌బీపీజీఆర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్లాంట్ జెనెటిక్ సంస్థ డైరెక్టర్ జ్ఞానేంద్ర ప్రతాప్‌సింగ్, వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి ఈ ఒప్పందంపై సంత కాలు చేశారు.

బీసీ రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి

పంజగుట్ట: జనాభా ప్రాతిపదికన బీసీల రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ చైతన్య సమితి జాతీయ అధ్యక్షుడు బీసీ రమణ డిమాండ్ చేశారు. బీసీలు ఎమ్మెల్యేలు, ఎంపీలు అయ్యే అవకాశం చాలామటుకు కోల్పోతున్నారని, రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కనీసం సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులుగా అయినా అవుతారని ఆయన పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీల వెనకబాటు తనానికి గత పాలకుల విధానాలే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ లేకపోవడం బాధాకరమన్నారు. జాతీయ బీసీ చైతన్య సమితి తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా భయ్యా వెంకటనర్సింహా రాజ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఎలిగేటి కృష్ణవేణిలను ఎంపికచేసి నియామక పత్రం అందజేశారు. త్వరలో జిల్లా, గ్రామ స్థాయి కమిటీలు వేస్తామని ఆయన వెల్లడించారు.

క్రైం కార్నర్..

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పవర్ ఎక్స్‌టెన్షన్ బాక్స్ రిపేర్ చేస్తుండగా ఘటన



విద్యుదాఘాతంతో మృతి చెందిన శ్రీనివాస్

సుభాష్‌నగర్: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం విశ్వకర్మకాలనీకి చెందిన శ్రీనివాస్(44) మంగళవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో ఇంట్లో పవర్ ఎక్స్‌టెన్షన్ బాక్స్ రిపేరు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారకస్థితికి చేరుకున్న అతన్ని మల్లారెడ్డి ఆస్పత్రికి తీసుకువెళ్లగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

అనుమానాస్పద స్థితిలో యువతి అదృశ్యం



పార్వతి (ఫైల్)

సుభాష్‌నగర్: అనుమానాస్పద స్థితిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సూరారం కాలనీకి చెందిన సత్యవతి, రమణలకు సూరిబాబు, పార్వతి(21) పిల్లలున్నారు. స్థానికంగా ఉండే ఎస్ఆర్ పవర్ కంపెనీలో భార్యాభర్తలిద్దరూ పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఈనెల 27న ఉదయం 8.30 గంటలకు సత్యవతి, రమణలు డ్యూటీకి వెళ్లగా ఇంట్లో పార్వతి ఒక్కత్తే ఉంది. సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి రాగా తాళం వేసి ఉంది. కుమార్తె కనిపించకపోవడంతో చుట్టుపక్కల, స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. యువతి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



దుండిగల్: నిర్మాణంలో ఉన్న భవనం మొదటి అంతస్తు నుంచి అనుమానస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి కిందపడి మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బహదూర్‌పల్లి ప్రాంతానికి చెందిన నర్సింగరావు గండిమైసమ్మ చౌరస్తా గణేశ్‌నగర్‌లో నూతనంగా భవనాన్ని నిర్మిస్తున్నాడు. కాగా ఈ నెల 28వ తేదిన సాయంత్రం 6 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి నిర్మాణంలో ఉన్న భవనం మొదటి అంతస్తుకు వచ్చాడు. రెండో అంతస్తులో సెంట్రింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఆ వ్యక్తి మొదటి అంతస్తులో నుంచి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ దృశ్యం సమీపంలో ఉన్న సీసీ కెమెరాలో రికార్డయ్యింది. మృతుడి వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందన్నారు. అతని చేతిపై తెలుగులో రాములు అని పచ్చబొట్టు ఉందని, ఇతర వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



రేణుక (ఫైల్)

దుండిగల్: మానసిక స్థితి సరిగ్గా లేని ఓ మహిళ అదృశ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా చిలివేయుల మండలం గుంపుల గ్రామానికి చెందిన కోల రేణుక(36) గత కొంత కాలం నుంచి మానసిక రుగ్మతతో బాధపడుతుంది. దీంతో ఈనెల 27న రేణుకను తన తల్లి యాదమ్మ నగరంలోని ఎర్రగడ్డలో చికిత్స చేయించేందుకు నగరానికి తీసుకువచ్చింది. ముందుగా గండిమైసమ్మలో నివాసముండే తమ సమీప బంధువు గోపి ఇంటికి తల్లీ కూతుళ్లు వచ్చారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన రేణుక కనిపించకుండా పోయింది. చుట్టు ప్రక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.